సర్వాంతర్యామి

"అయిన రభస చాలుకాని, యేదో వకటి తేల్చి చెప్పేసెయ్యండి, యింత రెట్టమతం నే నెక్కడా చూడలేదు, మన యింటా వంటా లేదు..." శాంతమ్మ కంగారుగా చూస్తూ నిలబడింది.

యాజులు ముభావంగా వింటూ కూర్చున్నాడు.

'ఇంతకీ యేమి తేల్చుకున్నారో చెప్పండి......వక్కరూ మాట్లాడరే...' శాంతమ్మ మళ్ళీ అందుకుని అన్నది.

'నేను చెప్పేదేమిటో యిందాక నే చెప్పేశా...అవే మళ్ళీ వినాలంటే యింకోసారి చెపుతా......' యాజులు తీవంగా అన్నాడు.

'అయితే నాస్తికమతంలో కలిసిపోయినా వన్నమాట అంతేనా...' శేషయ్య గట్టిగా కర్రుమన్నాడు.

'నువ్వు చెప్పినదానికల్లా 'ఊ' అనకపోతే నేను నాస్తికుణ్ణి అన్న మాట...' యాజులు బుసలుకొడుతూ అన్నాడు.

'ఎవరన్నా విన్నా నవ్విపోతారు కాని, వూరుకుందురు...' శాంతమ్మ వారిస్తోంది.

'చదువులు చెప్పించింది, యింత మన వంశాన్ని వుద్ధరిస్తావనుకున్నా గాని, యిట్లా మారిపోయి, నాకంఠంలో వుదకం పొయ్యావని అనుకోలేదు...' శేషయ్య యెంతో ఆవేశంగా అన్నాడు.

'మాట మాట్లాడితే తద్దినాలు, మనిషి పోయిన తర్వాత యేంచేయ్యాలి, యివే ఆలోచనలు, మనం బ్రతికివుండగా చెయ్యాలిసిందేమిటో అవి చూసుకోవటంలేదు...' యాజులు గిరుక్కున తిరిగి వెళ్ళిపోయాడు.

'ఎక్కడికిరా వెళుతున్నావు...ఇంతకీ తేల్చి చెప్పేసెయ్యి నాయనా, మీ యిద్దరిమధ్య నేను నలిగిపోతున్నాను. వస్తావారావా...' శాంతమ్మ

గుమ్మంముందర నుంచుని గట్టిగా అరిచింది.

యాజులు వెనక్కి తిరిగి ఆగేశాడు.

'నేను ఎక్కడికీ వెళ్ళటంలేదు. ఇప్పుడే వస్తాను. ప్రయాణం ఖాయమే...' యాజులు ముందుకు సాగాడు.

'ఏమిటండీ మీరు సరేను వాడితో సమానంగాను......' శాంతమ్మ కోపగించుకుంది.

'ఇదంతా నువ్వు నేర్పిందికాదు?...' శేషయ్య కస్సుమన్నాడు.

'అనండి...ఎన్నిసార్లేనా అనండి. ఏమో పెద్ద చదువులు చదివి యింత సంపాదిస్తాడనుకొన్నాను గాని, యిట్లా తయారవుతాడనుకొన్నానా ఏమిటి...' శాంతమ్మ కంటతడి పెట్టింది.

ఇంతలో బండీ తీసుకుని యాజులు వాకిట్లోతయారయ్యాడు. మొహం చిటచిటలాడించుకుంటూ శేషయ్య బండీలో ఎక్కాడు. శాంతమ్మ ఓమూట పట్టుకుని వెనకాలే బండీ ఎక్కేసింది. యాజులు మఫ్లర్ తలకు గట్టిగా చుట్టుకుని గభాలున వెళుతున్న బండీలోకి ఎగిరిపడ్డాడు. బండీవాడు ముందుకు రావాలి అని గోలపెడుతున్నాడు. పెట్టెలు మూటలు సర్ది బండీబ్యాలన్సు సరిచేశారు. కంకరరాళ్లు బండీని ఎత్తెత్తికొట్టేస్తున్నాయి. శాంతమ్మ తల రెండుసార్లు బండీబద్దలకు గట్టిగా కొట్టుకుంది. శేషయ్య ఆచికూర్చున్నాడు. యాజులు లెక్కలేనట్టుగా, నిరామయంగా అటూ ఇటూ వూగిపోతున్నాడు.

'ఈరోడ్డు ఇట్లా ఎంతవరకు ఉంటుంది. నాయనా...' శాంతమ్మ బాధ భరించలేక బండీవాణ్ణి అడిగింది.

'వేదాద్రి వెళ్లేదాక...' యాజులు వెంటనే సమాధానం ఇచ్చేశాడు.

'అయితే ఇంతకంటే నడిచివెళ్ళితేనే బాగుండేటట్లుందే...' శాంతమ్మ విసుగ్గా అంది.

యాజులు గభాలున క్రిందకు దూకాడు.

'అన్నీ అఘాయిత్యపుపనులు, దిగాలంటే బండీ ఆపదు?' శాంతమ్మ ఆపుకోలేక అంది.

"ఏం ఫరవాలేదులే...యీ బండీ దిగటంకూడా పెద్ద గొప్పేమిటి..." యాజులు బండీతోపాటు అడుగులు గబగబవేస్తున్నాడు.

మధ్య మధ్య మట్టిరోడ్డు తగులుతోంది. శాంతమ్మ ప్రాణం ఎంతో హాయి అనిపించింది.

"అబ్బ కాళ్లు తిమ్మెర్లు ఎక్కినాయి. నేనుగూడా కొంచెంసేపు దిగి నడుస్తాను...కాస్త బండీ ఆపవయ్యా..." శేషయ్యకూడా బండీ దిగాడు.

'నేనుకూడా దిగుతానువుండండి...' శాంతమ్మ దిగబోతోంది.

"నువ్వు నడవలేవే అమ్మ..." యాజులు వద్దని వారించాడు. బండీ గబగబ పోతోంది.

"నేను దిగుతానంటే దిగనీరేమర్రా, నాకు దిగితేనే ప్రాణం హాయిగా వుంటుంది..." శాంతమ్మ మొర ఆలకించేవారు యెవరూ కనిపించలా.

యాజులు, ప్రక్కలప్రక్కల వున్న తంగేడుపూలును కోసి వాసన చూస్తూ వస్తున్నాడు.

శేషయ్య కొంచెం వెనకపడ్డాడు.

గుబురుగా చెట్లసందుల్లోంచి బండీ పోతోంది.

"ఒరేయ్ అబ్బాయి నాన్నగారెక్కడ— ఏమయ్యోయ్ నీకే చెప్పేది కాస్త బండీ ఆపు. వెనకవాళ్ళనుకూడా రానీ..." శాంతమ్మ గదమాయించింది పై స్థాయిలో.

మళ్ళీ ముగ్గురు బండిలో చేరారు.

"ఎక్కడెక్కడివాళ్లు వస్తారు నరసింహస్వామి పాదాలదగ్గరకు. ప్రత్యక్షంగా నాకు అనేకసార్లు నా అనుభవంలో ఆయన మహత్తు నిదర్శనంగా కనిపించింది..." రెండుచేతులు జోడించింది శాంతమ్మ.

'ఇప్పటినుంచీ మొదలుపెట్టావు...ఇంకా వేదాద్రిరాలా...' యాజులు యెద్దేవాగా అన్నాడు.

"ఒరేయి నా మాట వినరా అబ్బాయి. దేవుడికి మొక్కితే దోప మేమీ వుండదురా. మన భక్తిశ్రద్ధలే మనల్ని కాపాడతాయి మళ్లీ మనం యింటికి తిరిగి వెళ్లేటంతవరకు నేను చెప్పినట్లు చెయ్యరా యాజులు..." యెంతో ఆప్యాయంగా ప్రాధేయపడింది శాంతమ్మ.

"నేను ప్రయాణం అయ్యేముందే నీకు చెప్పేశాను...మీరు వేదాద్రి వెళుతుంది ఒక పనికి, నేను వేదాద్రి వస్తుంది యింకో దానికి. చలిలో గజగజ వణుక్కుంటూ అన్ని మెట్లుదిగి ఆ కృష్ణా స్నానం చేసి, ఆ వికృతావతారానికి మొక్కటానికి రావటంలేదు. నేను వస్తుంది మానవుడు యెంత మూఢత్వంగా వుండగలడో ప్రత్యక్షంగా చూడటానికి, ప్రకృతినిచూసి ఆనందించటానికి..." యాజులు, శాంతమ్మ కళ్ళల్లోకి అదే దీక్షగా చూస్తూ అన్నాడు.

'అనొచ్చిన మాటలేదు అనరానిమాటలేదు. నోటి కెంతవస్తే అంతే...' శాంతమ్మ చీదరించుకుంది.

"నేను చెప్పటంలా వీడిబుద్ధి..." శేషయ్య అందుకున్నాడు.

"మీరు కాసేపు వూరుకోండి. ఈ రభస బైటవాళ్లుకూడా చూడా లేమిటి. మనింట్లో యెట్లాగో వుండనే వుంది—" శాంతమ్మ శేషయ్య మాటకు అడ్డు తగిలింది.

శాంతమ్మ, పెదిమలు కదిలిస్తోంది.

యాజులు, శాంతమ్మ అమాయకత్వానికి, ఆశ్చర్యపోతున్నాడు. తన తల్లిని, తండ్రిని యింకా తాను యేవిధంగాను మార్చలేనని నిశ్చయానికి వచ్చే శాడు. వాళ్ళకు చెప్పినా అర్ధంకాదు. వాళ్ళ జీవితాలు మూఢనమ్మకాలతో సుస్థిరమైన బాంధవ్యాన్ని యేర్పరచుకున్నాయి. ఎలాంటి నిదర్శనలు యిచ్చినా యెన్ని వుపమానాలు చెప్పినా, వాళ్ళ బుర్రలకు యెక్కవు. రాళ్ళను పూజించాలనేదే వాళ్ళ సిద్ధాంతం. దానికి ప్రతిఫలం యేమిటో అర్థంకాదు

శరీరాన్ని కష్టపెట్టితే, యెవరో మెచ్చుకుంటాడనుకోవటం కేవలం వెర్రి. తల్లీ, తండ్రీ మొహాల్లోకి కాసేపు చూసి, యిలాంటివాళ్ళకు కొడుకు నయ్యానే అని మానసికంగా బాధపడ్డాడు యాజులు.

"నరసింహస్వామీ! రక్షించు..." అంటూనే శాంతమ్మ బండీ దిగింది.

రామ రామ అంటూ శేషయ్య అడుగు క్రింద పెట్టాడు.

ఎంతో తీవ్రంగా ఆలోచిస్తూ, గుడిగోపురం చివర తన దృష్టిని పోనిచ్చి అట్లాగే నిలబడి పోయాడు యాజులు కొద్ది క్షణాలుదాక.

బండీవాడు పెట్టె మూట నెత్తిన పెట్టుకుని ముందు నడుస్తున్నాడు. వెనకాలే శేషయ్య, శాంతమ్మ, యాజులు వరసగా నడుస్తున్నారు.

దేవాలయప్రాంగణంలోకి వచ్చేశారు. ఎడమవైపు వరసగా గదులున్నాయి. అందులో చివరగదిలోకి వెళ్ళి పెట్టె, మూట పెట్టుకున్నారు. పేర్లు వ్రాయించుకున్నారు. వంటసామాగ్రి లెక్క పెట్టి ఒకాయన యిచ్చి వెళ్ళిపోయాడు.

"ముందర స్వామిదర్శనం చేసుకుందాం, నేను స్నానం చేసి వస్తా. మీరు యిక్కడ వుంటారా..." శాంతమ్మ భర్తను అడిగింది.

'మీ రిద్దరు వెళ్ళిరండి, నేను యీ సామానుకు కాపలా వుంటాలే...' యాజులు నిర్లక్ష్యంగా అనేశాడు.

'ఒరేయ్ మేము వచ్చినతర్వాత నువ్వుకూడా స్నానంచేసి రారా...' శాంతమ్మ, ఆప్యాయంగా యాజులువంక చూసింది.

"ముందర మీరు వెళ్లిరండి తర్వాతమాట చూసుకుందాంలే" యాజులు సూటిగా సమాధానం యివ్వలేదు.

కావలసిన బట్టలు తీసుకుని శేషయ్య శాంతమ్మ, స్నానానికి మెట్ల దగ్గరకు వెళ్లిపోయారు.

యాజులుకు వంటరిగా పెట్టెమీద కూర్చోవటం, అతనికే, కొంచెం సేపయినతర్వాత విసుగుపుట్టింది. మెల్లిగాలేచి ముందు పెద్ద హాలులోవున్న జనం దగ్గరకు వెళ్ళాడు.

ఓ పడుచుపిల్ల తలనిండా నీళ్లుపోసుకుని, తడిబట్టలతో గజగజ వణుకుతూ నుంచుంది. తడిబట్టలు ఆ అమ్మాయికి సిగ్గును తెచ్చిపెట్టాయి. ఇంకొంచెం మూలగా నక్కింది. యాజులు ఆ అమ్మాయిని చూసి జాలిపడ్డాడు.

"అమ్మా ఆకలే...అన్నంపెట్టవే..." ఇద్దరు పిల్లలు ఒకటే రాగం తియ్యటం మొదలుపెట్టారు.

"స్వామివారి ప్రసాదం రాగానే, మీకు అన్నం పెట్టేస్తాను. కాసేపు ఆగండి నాయనా! మీ తండ్రికాదు..." ఆ అమ్మ బ్రతిమాలుకుంటోంది.

పిల్లలు ఆ మాట వినకుండా వెక్కివెక్కి యేడుస్తున్నారు. యాజులుకు ఆమెమీద ఎంతైనా కోపంవచ్చింది.

"ఏమిటికి అట్లా పడుకున్నాడు..." ఓ ముసుగు పెట్టుకుని పడుకున్న మనిషిని చూసి యాజులు అడిగాడు.

"స్వామివారి కటాక్షం...ఇప్పుడు కొంచెం నెమ్మదిగావుంది నాయనా... నరసింహస్వామి నువ్వే మాకు దిక్కు నాయనా..." అక్కడ మనిషి రెండుచేతులు పైకెత్తి నమస్కారం పెట్టాడు.

"ఈ స్వామివారు డాక్టరుపనికూడా చేస్తాడన్నమాట..." యాజులు వికటంగా నవ్వాడు.

"మాతో చలాకీ ఆడటానికి వచ్చావా పో పోవయ్యా..." ప్రక్క నాయన కసురుకున్నాడు.

యాజులు యింకా నవ్వుకుంటూ బైటకు వచ్చేశాడు. లోపల వాళ్లు కోరచూపులు చూశారు.

"ఈ కోతులేమిటికి అసహ్యంగా..." యాజులు చిరాకుగా విదిలించాడు దగ్గరకువస్తున్న ఓ కోతినిచూసి.

కోతి కస్సుమంది.

'రామబంటు నాయనా! ఏమీ అనకూడదు...అవేమీ చెయ్యవు...' చెంపలు వేసుకుని ఓ ముసలమ్మ, కోతుల గుంపు మధ్యనుంచి నిరామయంగా వెళ్ళిపోతోంది.

యాజులు ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డాడు.

'ఒరేయి అబ్బాయి' నువ్విక్కడ నుంచున్నావు.మన సామానుదగ్గర యెవరా?...'శాంతమ్మ స్నానంచేసివస్తూ అడిగింది.

'నరసింహస్వామి...'యాజులు తెలివిగా నవ్వాడు.

శాంతమ్మ మాటాడకండా లోపలికి వెళ్లి, బట్టలు మార్చుకుంది. శేషయ్య పట్టు బట్టలు కట్టేసుకున్నాడు.

"ఒరేయి యాజులు నువ్వుకూడా స్నానంచేసి రా...నా మాట విను..." శాంతమ్మ, యాజులువైపుకు, తల తుడుచుకుంటూ అడుగులేసింది.

"ఎందుకూ..." కస్సుమన్నాడు యాజులు.

"నా మాట వినరా నీ మంచికే చెపుతున్నాను. నువ్వెళ్ళి కృష్ణలో స్నానంచేసి రా..." శేషయ్య యెంతో నిదానంగా బుజ్జగించాడు యాజుల్ని.

యాజులు మెదలకండా లోపలికివెళ్ళి తువ్వాల తీసుకున్నాడు.

"మమ్మల్ని యిక్కడ వుండమంటావా..." శాంతమ్మ యాజుల్ని పిలిచింది.

"మీరు, సామాన్ను కాస్త యెవరికైనా అప్పగించి గుళ్లోకి వెళ్లండి. నేను సరాసరి గుళ్లోకేవస్తాను..." యాజులు, తల్లివంక చూసి చిరునవ్వు మొహం పెట్టాడు.

శాంతమ్మకు యెంతో సంతోషం అనిపించింది. శేషయ్య, శాంతమ్మలు, గుళ్లోకి వెళ్ళిపోయారు. యాజులు మెట్లు గబగబ దిగేశాడు. మెట్లమీద వుండే స్నానాలు చేస్తున్నారు. కృష్ణపాయ చాలా చిన్నది. కాని చాలా లోతు. పై గట్టు యెంతో ఎత్తుగా కనిపిస్తోంది. అవతల వడ్డుమీద చెట్లు

గుబుర్లన్నీ గంభీరంగా కనిపిస్తున్నాయి. సూర్యకిరణాలు నీళ్లమీద పడి చిందరవందరయి పోతున్నాయి. యాజులుకళ్లు మిరుమిట్లు గొలుపుతున్నాయి. యాజులు చెంపమీద చెయ్యి పెట్టుకుని అట్లాగే నిలబడి యేమిటో తీక్షణంగా ఆలోచిస్తూ నుంచున్నాడు కొద్ది క్షణాలు.

యాజులుకు అంతా అయోమయంగా వుంది. అక్కడకు వచ్చినవాళ్ళల్లో బుర్రవున్నవాళ్లు ఎవరూ కనిపించలా. మూఢ విశ్వాసాలకు, హేతుబద్ధవాదానికి పొత్తుకుదరదు. మానవుని ప్రగతి ఇహంలో సాధించేకార్యాన్నిబట్టి నిర్ణయింపబడుతుంది. కాని, నిశ్చింతగా కూర్చుని, కనిపించని దేవునిమీద భారంవేసి, తాను పోయినతర్వాత ఏం జరగాలో ఆలోచించుకునేవాళ్లవల్ల నిర్ణయింప బడదు. తాను ఎంతగా ఆలోచించినా, తన వాదానికి బలమైన నిదర్శనలు కనిపిస్తున్నాయి. ఇక్కడకు వచ్చిన జనంయొక్క మనస్తత్వం, తన వాదాన్ని ఇంకా బలపరుస్తోంది. అట్లాగే కాసేపు నిలబడి, కుడివైపు కొండరాళ్ళను నెట్టుకుంటూ నడుస్తూ పోతున్నాడు. గుండ్రాళ్లు పేర్చిపెట్టినట్లు కనిపిస్తున్నాయి. అహర్నిశలు నీళ్ళకు రాళ్లకు సంఘర్షణే, రాళ్లకు యీరూపు యిచ్చింది. అనుకున్నాడు. తెల్లటిరాళ్లు, నల్లటిరాళ్లు, బంగాళాదుంప రంగురాళ్లు చిన్నచిన్నవి ముచ్చటగా చెల్లాచెదరుగా పడివున్నాయి. తనకంటికి ఇంపైనవి కొన్నింటిని ఏరుకుని జేబులో వేసుకున్నాడు. కొండరాళ్లు ఎక్కిదిగేటప్పటికి యాజులు అలసిపోయాడు. ఆ పళంగా అక్కడ కొంచెము ఎత్తుగావున్న ఓ కొండరాయిమీద చతికిలపడ్డాడు. కొంచెము చెమటకూడా పోసింది. ఎండ తీక్ష్ణం అనిపించింది. టైముకోసము, పొడుగు చేతులచొక్కా మడతను కొంచెము పైకితీశాడు. కళ్లు చెదిరిపోయినాయి ఒక్క క్షణంకాలం. కళ్లు విచ్చుకుని చూశాడు. గడియారం ఆగిపోయింది. ప్రపంచం అంతా ఒక్కత్రుటిపాటు స్థంభించినట్లయిపోయింది. యాజులు గభాలున తల పైకెత్తి చూశాడు. సూర్యకిరణాలు తీవ్రంగా యాజులు కళ్లల్లోకి గుచ్చుకుపోయినాయి. మెల్లిగా లేచి, కాళ్లీడ్చుకుంటూ, నడక సాగించాడు. వెనకాలే ఓకోతి తోడుగా వెంటనడుస్తోంది. వెనకాలే ఏదో వస్తున్నట్లు చప్పుడవుతుందేగాని, వెనక్కు తిరిగి చూడటానికి ఏమిటో భయమని

పించింది యాజులికి. అంత నిరామయంగా వున్న ప్రదేశంలో తాను వంటరిగా వున్నానని తెలుసుకునేటప్పటికే, గుండెదడ మొదలుపెట్టింది. అడుగులు చకచక సాగిస్తున్నాడు. యాజులుభయం తగ్గలేదు. యాజులుకు ముందుకు పోవటానికి ధైర్యంలేదు. చప్పున ఆగేశాడు.

కోతి వచ్చి కాలును తాకింది. 'అమ్మో' అంటూ వులిక్కిపడి గాభరాపడి పోయాడు. అక్షణంలో నరసింహస్వామి విగ్రహం, తన తల్లి, తన తండ్రి తన కళ్ళలో మెరిసి అదృశ్యమయిపోయారు.

'ఛీ...నువ్వా...పాడుకోతి...యెంతపనిచేశావు...క్రింద ఓ రాయి' తీసి కోతిమీదకు విసిరాడు.

కోతి కిచకిచమని నవ్వింది.

యాజులుకు మరింత కోపం వచ్చింది. తాత్కాలికంగా తన మెదడులోకి దూరిన కొన్ని ఆవేశాలను, వెంటనే తుడిచేసుకున్నాడు. తనమీద తనకే అసహ్యం కలిగింది. తన ఆలోచన యీకాస్తలోనే పెడదోవన యెందుకు పట్టిందో అర్థం కాలేదు. ఏదో విసుక్కున్నాడు. ఎంతో నిందించుకున్నాడు. మెట్లదగ్గరకు వచ్చేశాడు. అలసటతీర్చుకుని" కాళ్లు చేతులు మొహం కడుక్కొని కడుపునిండా కృష్ణనీరు త్రాగి మెట్లు యెక్కేశాడు. కాళ్లు పట్టుకుపోతున్నాయి. సగం మెట్లు యెక్కేటప్పటికి కాళ్లు చచ్చుపడిపోయివాయి. ముసలమ్మలు కూడా 'నరసింహస్వామి నరసింహస్వామి' అనుకుంటూ తనకంటే ముందరగానే మెట్లు యెక్కేసి వెళ్లిపోతున్నారు.

యాజులుకు ఆవేశం వచ్చింది. పట్టు బలవంతాన గబగబ, వయస్సు సహాయంతో మెట్లన్నీ యెక్కేసి సత్రంలో పడ్డాడు. అందరూ యెవరి పనుల్లో వాళ్లున్నారు. అక్కడ గడియారంకూడా తన పని తాను చేసుకుపోతోంది. అ గడియారంటైముతో తన గడియారాన్ని సరిదిద్దుకున్నాడు. ఆకలి మండిపోతోంది. ఈగుళ్ళోంచి వీళ్లెప్పుడు బైటపడతారో తెలీదు వాళ్లు వచ్చేదాకా కూర్చోటమా, లేక తానుకూడా గుళ్ళోకే వెళ్ళటమా

ఏకంగా, యీ సందిగ్ధావస్థలో కొంచెం సేపు నలిగి, చివరకు, తానే గుళ్ళోకి వెడదామని లేచాడు.

మండపానికిముందు చెప్పుల్ని వదిలేసి, మంటపం దాటి గర్భ గుడిలోకి వెళ్ళాడు. అవిరళంగా మంత్రాలు చదువుతూ పూజలు చేస్తున్నారు. శేషయ్య కళ్ళుమూసుకుని తలవూపుతున్నాడు. శాంతమ్మ రెండు చేతులు జోడించుకుని కదలక మెదలక కూర్చుని వుంది. ఇంకా అటూ ఇటూ, ఆడ, మగ బారులుతీర్చుకుని కూర్చుని వున్నారు. యాజులుకు అంతమందిలోను, అమ్మా అనిగాని, నాన్న అనిగాని, పిలవటానికి నామోషి అనిపించింది. అట్లాగే కొంచెం సేపు నిలబడిపోయాడు నరసింహస్వామివంక చూస్తూ. వెంటనే విసుగుపుట్టి, గభాలున వెనక్కు తిరిగాడు. ఛటుక్కున అందరూ లేచి నుంచున్నారు. హారతి కర్పూరం వెలిగించుకుని, ఆ పళ్ళెం కాస్త పూజారి అందరకు చూపిస్తున్నాడు. ప్రతివాళ్ళు ఎంతో భక్తి శ్రద్ధలతో కళ్ళకు అద్దుకుంటున్నారు. యాజులు వెనక్కు తిరిగి చూడకుండానే గబగబ మండపందాటి బైటకు వచ్చేశాడు.

'అయ్యా, అమ్మా, గుడ్డివాణ్ణండి, కుంటివాణ్ణండి. ఇంత ధర్మం వెయ్యండి బాబు, మీకెంత పుణ్యం ఉంటుంది' అంటూ హాహాకారాలు వినిపిస్తున్నాయి.

'తల్లిలేని పిల్ల నాయనా, ధర్మం వెయ్యి నాయనా...' ఓ అభాగ్యరాలు యాజులు దగ్గరకువచ్చి అడిగింది.

గభాలున జేబులోంచి ఓ అణా తీసి యిచ్చేశాడు.

'నీ కెంతైనా పుణ్యం ఉంటుంది నాయనా...' బిచ్చగత్తె యింకా ఏమిటో అంటోంది.

యాజులు కొరకొరగా ఆమెవైపుకు చూసి ముందుకు సాగాడు.

శేషయ్య, శాంతమ్మ, 'అబ్బాయి యేడీ రాలేదేమిటి' అంటూ అటూ యిటూ చూస్తున్నారు.

'అదుగో వెళుతున్నాడు...ఓరేయ్ యాజులు ప్రసాదం తీసుకున్నావుట్రా...' శాంతమ్మ బిగ్గరగా అరిచింది.

యాజులుకి యెంతో సిగ్గనిపించింది. తీసుకున్నాలే రమ్మని సంజ్ఞ చేశాడు.

'ఇందాకటినుంచి యెక్కడున్నావురా...' శాంతమ్మ యాజులు మొహాన కుంకం పెడుతూ అడిగింది.

'గర్భగుళ్ళోనే...' కుంకం చెరిపేసుకున్నాడు యాజులు. శేషయ్య కూడా సత్రంలోకి వచ్చాడు.

ఇక వంటప్రయత్నం చేసి భోజనాలు అయ్యేటప్పటికి మూడు కొట్టారు.

యాజులు ప్రాణం శోషిల్లింది. మస్తుగా నిద్రపోయాడు. శేషయ్య మోతాదుగా కునుకుతీసి లేచి కూర్చున్నాడు. శాంతమ్మ కునికిపాట్లు పడుతూనే మేలుకు వుంది.

'ఒరేయ్...ఇంకా నిద్రేమిటిరా ప్రొద్దుకూకుతుంటే...నిన్నే, లేవవే ...స్వామిదర్శనం చేసుకొని, రెండు మెతుకులు నోట్లో వేసుకుని పడుకుందిగాని లే...' శాంతమ్మ యాజుల్ని నిద్రనుంచి లేపటానికి ప్రయత్నం చేస్తోంది.

యాజులు వళ్లు విరుస్తున్నాడేగాని లేవటంలేదు. కలత నిద్రలో యేవేమిటో అస్పష్టంగా అంటున్నాడు.

'స్వామివారిని మనసార మొక్కుకో మనకేకష్టాలు రాకుండా కాపాడుతూ వుంటాడు...' శాంతమ్మ తట్టి లేపుతోంది. యాజులికి యేమిటో అస్పష్టంగా వినిపించినాయి. గభాలున లేచి కూర్చున్నాడు.

'నా నిద్రంతా చెడకొట్టావు కాదుటే...' యాజులు కళ్లు తుడుచుకుని, చూశాడు.

'కాళ్లు మొహం కడుక్కురా, గుళ్ళోకి వెళ్ళొద్దాం...' 'మీరు వెళ్ళిరండే...నాకు నిద్రొస్తోంది...'

'మరీ వేషాలు కాని ఇప్పుడు నిద్రేమిటిరా. ఏదీ కాని వేళ; లే...నా మాట విను...'

'ఏమిటో మత్తుగా వుందే...'

"అన్ని మత్తులు వదులుతాయి లే...త్వరగా అలస్యం చెయ్యక, యిప్పటికే ఆలస్యం అయింది..." శాంతమ్మ నాలుగూ సర్దేసి, గుళ్లోకి వెళ్లే ప్రయత్నంలో సిద్ధమయింది. శేషయ్య వుత్తరీయం పూర్తిగా కప్పేసుకుని నిలబడ్డాడు. యాజులు నిక్కినీలిగి, మొహం కడుక్కుని బైటకు వచ్చేటప్పటికి ఆరయింది. ఆదరా బాదరాగా శేషయ్య, శాంతమ్మ గుడివైపుకు నడిచారు. వెనకాలే యాజులు కూడా వెళుతున్నాడు.

రెండు మూడుసార్లు వెనక్కి తిరిగి కొడుకుని తొందరగా రమ్మనమని చెప్పి, శాంతమ్మ ముందుకు వెళ్ళిపోయింది. యాజులు నీటుగా నడుస్తూ మంటపానికి యెదురుగా వున్న ధ్వజ స్తంభం గట్టుమీద చెప్పులతో అట్లాగే, మోకాళ్లను రెండు చేతులతో బంధించేసి కూర్చోబడిపోయాడు. నలుగురైదుగురు చూసి కూడా లోపల యేమేమిటో అనుకుంటూ వెళ్ళిపోయారు.

ఒకాయన మాత్రం ధైర్యంచేసి, "చెప్పులతో కూర్చుంటారుటయ్యా యిక్కడ, నీ కెవరు చెప్పారు. చెప్పులు విడిచేసెయ్యి" అని గదమాయించాడు.

యాజులుకి ఆయనతో వాదనలోకి దిగాలని వుంది కాని, అక్కడవున్న జనం అంతా యాజులు కళ్లల్లో తాండవమాడారు. యాజులు వెంటనే చెప్పులు జారవిడిచాడు.

కొంచెంసేపటికి, శాంతమ్మ బయటకువచ్చేసి ఇదిగో ప్రసాదం తీసుకోమని ఇచ్చింది.

చక్రపొంగలి నాకు బాగా ఇష్టమని, యాజులు తినేశాడు.

పండువెన్నెల. కోతులన్నీ తమ శరీరాన్ని ముడుచుకుని, గుడిగోపురం చుట్టూ కాపలాగా పడుకున్నాయి. అప్పుడప్పుడు మాత్రం కిచకిచలు

వినిపిస్తున్నాయి. ఇతర ఆసరాలేనివాళ్లు మంటపంలో బట్టలు పరుచుకుని పడుకున్నారు. సత్రం తలుపులు భార్లగా తీసి లోపల చాపలు వేసుకుని వరసగా పడుకున్నారు. అందులో ఏనియమాలూ ఎవరూ పాటించలేదు. ఒకళ్లమీద ఒకళ్లకు అనుమానంలేదు. అందరి మనస్సులు అనంతమైన శాంతితోను, అపూర్వమైన తృప్తితోను నిండివున్నాయి. అందరూకూడా భక్తిప్రపత్తులతో కైమోడ్చి, నరసింహస్వామితో కైంకర్యం అయిపోవాలనే తాపత్రయంతో నిద్రలుపోతున్నారు. యాజులుకు మాత్రం నిద్రపట్టటంలేదు. యాజులుకు ఎన్నెన్నో ఎక్కడెక్కడివో జ్ఞాపకం వచ్చేస్తున్నాయి. తన మనస్సుకు శాంతిలేదు. తన ఆలోచనలకు అంతంలేదు. అతని ఆలోచనల్లో నరసింహస్వామి విగ్రహం, గడిచినరోజు తడిబట్టలతో వున్న ఆ పడుచుపిల్ల, అమాయకపు తల్లిదండ్రులు, నిశిత విమర్శనాజ్ఞానంగల తన తెలివితేటలు, ఇంకా ఏవేవిటో జ్ఞాపకం వస్తున్నాయి. తానులేచి అంత సావిడిలోనూ, కళ్లు పెద్దవి చేసుకుని ఒక్కొక్కళ్లనే చూస్తున్నాడు. ఒకళ్లు ఇద్దరు ప్రక్కమీద మసలుతున్నారు. ధైర్యంచాలక మళ్లీ వెనక్కు వెళ్ళిపోతున్నాడు. చివరకు తన పిరికితనమే గెలిచింది. దానికి తోడు గడియారంకూడా నాలుగుదెబ్బలు కొట్టింది. యాజులు గుండెమీద. కోడి కొక్కొరకో అంది. యాజులు నిద్రపోయాడు.

ఉదయకిరణాలు మెల్లిమెల్లిగా ప్రాక్కుంటూ కిటికీలోంచి యాజులు కప్పుకున్న దుప్పటిలోకి చొరబడ్డాయి. యాజులు అటూ ఇటూ దొర్లాడు. ఇంకా యెంత ప్రయత్నించినా నిద్రపోయే వాతావరణం కనిపించటంలేదు.

తప్పనిసరిగా లేచి, దుప్పటి అవతలకు గిరాటు పెట్టాడు. అప్పటికే శేషయ్యా, శాంతమ్మ, స్నానాలు చేసేసి వచ్చేశారు. శాంతమ్మ మొక్కు ఆనాటితో తీరిపోయింది. ఎన్నాళ్లనుంచో వేదాద్రివెళ్లాలని, నరసింహస్వామి దర్శనం చేసుకోవాలని అనుకుంటూ వుండేది. ఏమేమిటో మొక్కుకుంది. యాజుల్ని గురించి యింకా తనకోర్కెలన్నీ యాజులలోనే కేంద్రీకరించి, యాజులుమీద గంపెడాశతో వేదాద్రి వచ్చేసింది. శేషయ్యా, శాంతమ్మ పోరుపడలేక వచ్చినా, భక్తిశ్రద్ధలలో శాంతమ్మకు యేమాత్రం తీసిపోడు. ఇద్దరికీ

కూడా యాజులు అతిశ్రద్ధగా గుళ్లోకివచ్చి పూజ చెయ్యాలని ఉంది కాని అది జరగలేదు. ఆ కించ శాంతమ్మను పట్టుకు పీడిస్తోంది కాని ఆమె చెయ్యగల దేమీ లేదు.

యాజులు తొందర పెడుతున్నాడు, త్వరగా తెమిలిరమ్మని. ఓమూల బండివాడు కూడా రండిరండి అంటూ హెచ్చరిస్తున్నాడు. ఓపట్టాన వాళ్ళు రావటంలేదు. యాజులుకి యెంతైనా కోపంవచ్చింది. ఉన్నవాళ్లను ఉన్నట్లుగా తీసుకువద్దామని చకచక గుడివైపుకు నడుస్తున్నాడు. హడావిడిగా వెళ్ళటంలో కోతిపిల్ల కాలుక్రిందపడి కిచకిచమంటూ పరుగెత్తింది. ఎక్కడి నుంచో ఢభాలున పెద్దకోతి వచ్చి యాజులుకాలును కరిచింది.

"అబ్బో!" అంటూ కాలు గట్టిగా పట్టుకున్నాడు. ఇంకా ఇంకా కోపంతో గుళ్లోకి వెళ్ళాడు.

శేషయ్య, శాంతమ్మలు విగ్రహాలులాగా చేతులు జోడించుకొని నిలబడి ఉన్నారు.

యాజులు ఒక్క కేక పెట్టాడు.

ఇద్దరూ ఒక్కసారిగా వులిక్కిపడ్డారు.

"ఏమిటిరా..."

"ఎంతసేపు యిక్కడ ఓమూల బండీవాడు గోలపెడుతుంటే" వెనక్కి తిరిగి కాలు పట్టుకుంటూ యాజులు బండీలోకి ఎక్కాడు.

"ఏమిటిబాబు కాలు..." బండీవాడు అడిగాడు.

"ఏంలేదు...కోతి కరిచింది..." కరిచినచోటు శుభ్రంగా తుడిచేసి, కుంకం అద్దేశాడు.

కొంచెం చురచుర మంటోంది.

శేషయ్య, శాంతమ్మలుకూడా బండిదగ్గరకు వచ్చేశారు.

"అబ్బాయిగారిని కోతి కరిచిందిటండీ..." బండివాడు ఆపుకుంటూ ఆపుకుంటూ అనేశాడు.

"ఏరా నాయనా ఎక్కడరా..." పెద్ద ఆదుర్దాగా శాంతమ్మ కాలు కట్టు విప్పుతోంది.

"ఏంలేదులేవే, కోతి పట్టుకుంది. విదిల్చేశాను, అంతే...అయినా ఏమిటాలస్యం. తొందరగా రాక మీకోసం నేను గుళ్లోకి వస్తుంటే, యీ లోపల యిది జరిగింది..."

"ఏమన్నా వేశావా మరి..." శేషయ్య, చిరాకుగా అడిగాడు.

"అదే పోతుందిలే...తొందరగా పోనియ్యవయ్యా..." యాజులు కాలు పట్టుకు తన్ని పెట్టి వుంచాడు.

'చిన్నగా మనం యింటికి వెళ్ళక యిదేమిటంట...' శాంతమ్మ బండీలో మొదలు పెట్టింది.

"ప్రతిదానికి నువ్వేదో అనుకుంటూనే వుంటావు...ఏం భయంలేదు కాని నువ్వేమి మాట్లాడక..." యాజులు ఎంతో కోపంగా విసుక్కున్నాడు.

"ఇప్పుడు చేసేదేముంది. ఇంటికి వెళుతున్నాంగా ఏదోమందు వేద్దాంలే..." శేషయ్య సమాధానపరిచాడు. ఇల్లు చేరేలోగా మాటల్లో ఏదో ఘర్షణపడుతూనే వున్నారు తల్లీ కొడుకూను.

యాజులు చిటచిటలాడిపోతున్నాడు. శాంతమ్మ బిక్కు బిక్కుమంటోంది. బండీ వాకిలిదగ్గరకు వచ్చి ఆగిపోయింది. యాజులు బండీచువ్వ పట్టుకుని మెల్లిగా దిగాడు. శాంతమ్మ దిగుతూనే, ఒరేయి అబ్బాయి ముందర నువ్వు ఆసుపత్రికి వెళ్ళి ఏదైనా మందేయించుకు రా అన్నది.

యాజులు సరాసరి ఆసుపత్రికి వెళ్ళి కట్టు కట్టించుకు వచ్చాడు.

"ఏమన్నాడు డాక్టరు..."

"అనేందుకు ఏముంది. కట్టుకట్టేశాడు. దీంతో నయమయి పోతుందన్నాడు ప్రతిదానికి నువ్వు భయపడుతూ వుంటావు..." యాజులు నిర్లక్ష్యంగా లోపలికి వెళ్ళిపోతున్నాడు.

"నరసింహస్వామి దయవలన త్వరగా నయమవుతే బాగుండును" శాంతమ్మ అనుకుంటున్న మాటలు యాజులు విన్నాడు.

"ప్రతిదానికి నీ శొకడు దొరికాడు ఆయన, కోతికరిచిన దానికి ఆయన రక్షే! ఇంకా డాక్టర్లెందుకు..." యాజులు విసుగ్గా అంటూనే గదిలోకి వెళ్ళిపోయాడు.

రెండుమూడు రోజులైంది, కట్లు మారుస్తున్నారు, పుండు నయం కావటంలేదు, నొప్పి యెక్కువగానే వుంది. యాజులుకు ఓ విధమైన చిరాకు, అహంకారం, కోపం యెక్కువయిపోతున్నాయి. మనస్సంతా గజిబిజిగా వుంది. ఏవీ చెయ్యటానికి తోచటంలేదు. పడక కుర్చీలో పడుకుని, మెల్లిగా కాలుఎత్తి, ఎదురుగట్టుమీద పెట్టాడు. ఆ కట్లు చూస్తుంటే యేమిటోగా భయమేస్తోంది. డాక్టరు యింజక్షన్ తీసుకోవాలి అన్నమాట అకాత్తుగా జ్ఞానకం వచ్చింది. విషం యేదైనావుంటే వుండచ్చు అన్నాడు కూడా. మరీ భయంవేసింది. ఆపుకోలేని దుఃఖము వచ్చేస్తోంది. అసలు తాను ఆ వూరు యెందుకు వెళ్లానా అని పశ్చాత్తాపపడుతున్నాడు. మనస్సంతా వక్క క్షణంలో తనను కరచిన కోతిమీదకు పోయింది. ఆ కోతిమీద పట్టరాని కోపం వచ్చింది. తానెందుకు అటు వెళ్లాలిసివచ్చిందో క్షణంలో స్ఫురణకు వచ్చింది, తన తల్లితండ్రులు గుళ్లో పూజలు చేస్తున్నారు; కళ్ళకు కట్టినట్లు కనిపిస్తోంది. తన కళ్లు అప్రయత్నంగా నరసింహస్వామి విగ్రహంమీద పడ్డాయి. కళ్లు చెదరిపోయినాయి, వళ్లు వణికించి చప్పున కుర్చీలోంచి లేచాడు.

"ఎక్కడికిరా వెళ్లుతున్నావు..." శాంతమ్మ, యాజులు వంక చూస్తూ అన్నది.

'ఎక్కడికీ లేదులేవే...' విసుగ్గా, యెదురుగావున్న పెట్టెను విసురుగా ఒక్క తన్ను తన్నాడు.

"అయ్యో!...అయ్యో!..." శాంతమ్మ గుండె బాదుకుంటూ, పెట్టెలోంచి క్రిందపడిపోయిన బట్టల మడతలు, రెండు చిన్న డబ్బీలు తీసి కళ్ళకు అద్దుకుంది.

"వేదాద్రి ప్రసాదం...దీంట్లో పటాలు... ఎంత పాడుపని చేశావురా..." శాంతమ్మ ఓచిన్న డబ్బీని యాజులు చేతులో పెట్టింది.

యాజులు స్తంభించిపోయాడు. గుండె దడదడ కొట్టుకుంటోంది. కళ్లార్పకుండా తల్లివంక అట్లాగే చూస్తూ నిలబడిపోయాడు కొద్ది క్షణాలు.

"ఏమిటే అట్లా నిలబడిపోయారు..." శేషయ్య వస్తూనే అడిగాడు.

యాజులు వులిక్కిపడ్డాడు.

"ఏం లేదులెండి..." శాంతమ్మ లోపలికి వెళ్లిపోయింది.

యాజులు బుర్ర గిర్రున తిరిగిపోతోంది. ఆరాత్రంతా యాజులు మనస్సు కలవరపడిపోయింది. అతని ఆలోచనలు అనేకరకాలుగా పోతున్నాయి. కాని ఏస్థానం కూడా కేంద్రీకరించలేకపోతున్నాడు. మనస్సు వూగిసలాడిపోతూనే వుంది.

భల్లున తెల్లారింది.

యాజులు ఇంకా మంచంమీదే పడుకుని వున్నాడు. ఇంకా కళ్లు తెరవలేదు. మెల్లిగా శాంతమ్మ యాజులుమంచందగ్గరగా వచ్చి చూస్తూ నిలబడింది. శేషయ్య ప్రక్కనుంచి వెళుతూ ఆగాడు.

"ఇంకా నిద్రపోతున్నాడు..." శాంతమ్మ శేషయ్య మొహంలోకి చూస్తూ అన్నది.

"కోతివుండు బ్రహ్మరాక్షసి అయిందే..." శాంతమ్మ యాజులు మొహంలోకి చూస్తూ నివ్వెరపోతోంది.

'చెపుతే వింటాడా పెడతాడా...ఎట్లా జరగాలో అట్లా జరుగుతుంది...' శేషయ్య నిట్టూర్పు విడిచాడు.

"ఏమండీ, స్వామివారికి మొక్కుకుంటే వుండు నయమవుతుందని నాకు గట్టిగా వుందండి...వాడితో యీ మాటచెపితే కస్సుమంటాడని వూరుకుంటున్నాను. మీరన్నా చెప్పండి..." శాంతమ్మ ప్రాధేయపడింది.

"నేను చెపితే వింటాడు కనకనా...పాపభీతి లేదు, దైవభక్తిలేదు వాడికే తెలిసివస్తుందలే..." శేషయ్య అంటీఅంటకండా అన్నాడు.

శాంతమ్మ మారుమాట్లాడలేదు. ఒక్కక్షణం అక్కడే నిలబడి వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది.

యాజులు కళ్లు తెరిచాడు.

కాళ్లీడ్చుకుంటూ నడుస్తున్నాడు. ఓపిక పూర్తిగా తగ్గిపోయింది. మానసిక బలహీనత యేర్పడిపోయింది. మానసిక బలహీనతతో శరీరస్థితికూడా యేమీ బాగా వుండటంలేదు. క్రమక్రమేణా చిక్కిపోతున్నట్లు కనిపిస్తున్నాడు. కట్లుకట్టటం, ఇంజక్షన్లు తీసుకోవటం జరుగుతూనే వుంది.

"అబ్బాయి ఇంకా రాలేదేమండీ ఏడుకూడా దాటింది..." శాంతమ్మ వాకిటి గుమ్మంపైపు చూస్తూ అన్నది.

శేషయ్య ఏమీ మాట్లాడలేదు.

"అదుగో అంటుండగా వస్తున్నాడు, నూరేళ్లాయుస్సు. ఎక్కడికి వెళ్ళావురా...సంధ్యచీకటికూడా..." శాంతమ్మ ఆప్యాయంగా అడిగింది.

"ఎవరో స్నేహితుడు వస్తే మాట్లాడుతూ కూర్చున్నాను..." నిర్లక్ష్యంగా సమాధానం చెప్పేసి, కుంటుతూ లోపలికి వెళుతున్నాడు యాజులు.

ఇంతలోనే వాకిటితలుపు తీసుకుంటూ, ఒకతను వచ్చాడు.

"అయ్యగారు హుల్లో మనీపర్సు మరిచిపోయారుట, యిచ్చి రమ్మన్నారండి" అంటూ అతను, యాజులు పర్సు శేషయ్యకు ఇచ్చాడు.

యాజులు విననట్టుగా నటించి, మెదలకుండా లోపలికి వెళ్లిపోయాడు.

"మీ స్నేహితుడు ఈ పర్సు తెచ్చియిచ్చాడు. అక్కడ మర్చిపోయావుటగా" అంటూ ముక్తసరిగా శేషయ్య పర్సును అక్కడ పెట్టేశాడు.

యాజులుకు ఆత్మాభిమానం దెబ్బతిన్నట్లనిపించింది ఆ క్షణములో ఏమీ మాట్లాడలేకపోయాడు. ఆ రాత్రి అన్నం తింటున్నప్పుడుకూడా

ఏమీ మాట్లాడలేదు. ఆరాత్రికూడా మనోవేదనతోనే తెల్లారింది యాజులుకి ఆ పుండునుగురించిన ఆవేదన ఎక్కువయిపోతోంది యాజులుకి. తనమనస్సు కేమిటో అస్పష్టముగా మానవశక్తికి మించిన ఏదో వొకశక్తి వుందని తట్టు తోంది. కాని తన మనస్సును సమాధానపరచుకోటానికి కష్టపడుతున్నాడు. అంతర్ఘర్షణ తీవ్రంగా సాగిపోతోంది. తన మనస్సు సమాధానపడినా, ఇతరుల యెదుటకు వెళ్లటానికి ధైర్యం చాలటంలేదు. తన మనస్సు, గతానికి విరుద్ధంగా సమాధానపడటానికి ఒక బలవత్తరమైన కారణం ఉండివుంటుందని యాజులు తృప్తిపడ్తున్నాడు. కాని హృదయం విశాలమయినకొద్దీ మొహం చిన్నదయి పోతోంది. ఈ క్షోభ యాజులు భరించలేకపోతున్నాడు. ఓమూల పుండుబాధ తగ్గటంలేదు. మనస్సు సమాధానపడినతర్వాత, మానసిక సంక్షోభముతోపాటు, శారీరక దౌర్బల్యంకూడా కొంచెం కొంచెంగా తగ్గుతున్నట్లు కనిపిస్తోంది. తాను వూహించలేని హాయి ఎక్కడినుంచో వచ్చి యాజులును తృప్తిపరు స్తోంది.

మెల్లిగా కాలుకట్టు చూసుకుంటున్నాడు. అతనికి ఆవేదన ఎక్కువయి పోయింది. ఇక భరించలేకపోతున్నాడు. గభాలున లేచాడు. కాలు గట్టిగా ఎత్తి ఒక అడుగువేశాడు. అడుగులు వేసుకుంటూ గదిలోకివెళ్లి, పెట్టెలోకి నాలుగు బట్టలు కుక్కేశాడు. ఆదరాబాదరాగా అవీ ఇవీ సర్దేసుకుని పెట్టె పట్టుకుని సావిట్లోకి వచ్చేశాడు.

"ఎక్కడికిరా నాయనా. వెళుతున్నావు..." జంకుతూనే శాంతమ్మ అడిగింది.

యాజులు ఏమీ మాట్లాడకుండా అట్లాగే నిలబడిపోయాడు.

శాంతమ్మ భయంగా ఇంకోసారి అడిగింది.

'అమ్మ!...వేదాద్రికి...స్వామివారి దర్శనానికి...' ఎంతో నిబ్బరంగా, పట్టుబలవంతాన అన్నాడు యాజులు.

యాజులు పెద్దగా ఆయాసపడిపోతున్నాడు.

"అయ్యో పిచ్చినాయనా...స్వామివారి దర్శనానికి, యిలా కుంటు కుంటూ, వేదాద్రి వెళ్ళతావుట్రా...స్వామివారిమీద భక్తి శ్రద్ధలు వుండాలి గాని, ఆయన లేనిచోటంటూ వుందిట్రా...ఇదిగో ప్రసాదం...ఇదిగో ఆయన పటం..." పెదిమలు తడబడుతూ, శాంతమ్మ, యాజులు చేతిలో పెట్టింది.

యాజులు శరీరంలోకి విద్యుత్తులాగ ఒక నూతన ఆవేశం ప్రవేశించి, ఆయన హృదయంలోకి చొచ్చుకుపోయింది. చేతిలో పెట్టెను మెల్లిగా జార విడిచేసి, నిలువునా కూలబడిపోయాడు యాజులు.